

పిఠాపురంలో కారు టాపు ఎక్కి.. పార్టీ జెండా ఊపుతూ.. యువతి ఆనందం



జగన్‌కు స్వాగతం పలకడానికి పార్టీ జెండాలతో పరుగున వస్తున్న మహిళలు



జగన్‌ను చూసేందుకు భవనం ఎక్కిన జనం

జగనాభిమానం ఆకాశమంత

- పిఠాపురంలో జైత్రయాత్రను తలపించిన బస్సుయాత్ర
- అడుగడుగునా అభిమాన నేతకు ఘన స్వాగతం
- నియోజకవర్గంలో దారి పొడవునా జన నీరాజనం



సామర్లకోటలో తనను చూసేందుకు వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

పిఠాపురం/కొత్తపల్లి/గొల్లప్రోలు: తమ అభిమాన నేతను కళ్లారా చూసేందుకు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసిన జనం. సాయంత్రం వస్తారని తెలిసినా మండుటెండలో మిట్ట మధ్యాహ్నమే రోడ్డుకు చేరుకున్న ప్రజా సమూహం. తన మనవడి చూడాలని ఊత కర్రతో ఉత్సాహంగా వచ్చిన తాత, ఓపిక లేకున్నా శరీరం సహకరించకపోయినా తన మనవడిని మనసారా చూడాలన్న తపనతో అడుగు లేసుకుంటూ వచ్చిన అవ్వ, ఎండలో చంటి బిడ్డను చంకన ఎత్తుకుని పరుగెడుతూ వచ్చిన ఓ తల్లి. నీవే మా భవిష్యత్తు.. నీ వెంటే మేమంతా.. అంటూ ఉరకలేసిన యువత.. 'అన్నొచ్చాడు' అంటూ డీజేలతో స్టెప్పులేస్తూ.. ఆనందంతో ఆకాశమంత అభిమానాన్ని చాటుకున్న అక్కాచెల్లెమ్మలు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా కనిపించిన దృశ్యాలివి. మేమంతా సిద్ధం బస్సు యాత్ర పిఠాపురం నియోజకవర్గ వాసుల ఆదరాభిమానాల మధ్య జైత్రయాత్రను తలపించింది. భగభగ మండే భానుడిని సైతం లెక్క చేయకుండా, అశేష జన వాహిని పిఠాపురంలో యాత్రకు బ్రహ్మరథం పట్టింది.

పిఠాపురం మండలం చిత్రాడలో రాత్రి 6.58 గంటలకు మేమంతా సిద్ధం బస్సు యాత్ర నియోజకవర్గంలో అడుగు పెట్టింది. అక్కడి నుంచి పిఠాపురం పాదగయ సెంటర్‌కు చేరుకున్న యాత్రకు మధ్యాహ్నం నుంచి ఎదురు చూస్తున్న అభిమానులు, పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద తన కోసం ఎదురు చూస్తున్న ప్రజానీకానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు పైనుంచి చేతులు పైకెత్తి అభివాదం చేస్తూ, ఆప్యాయంగా అందరినీ పలకరించారు. అక్కడి నుంచి పిఠాపురం బైపాస్ 216 జాతీయ రహదారిలో విరవాడ సెంటర్, రాయవరం సెంటర్, వై.జంక్షన్ వద్ద జనాలు బారులుతీరి, రోడ్లకు ఇరువైపులా నిలబడి పూలజల్లులతో ఆయనకు ఘన స్వాగతం పలకగా, ఆయన అందరికీ అభివాదం చేస్తూ యాత్ర కొనసాగించారు.

గొల్లప్రోలు టోల్ ప్లాజా నుంచి ప్రత్తిపాడు రోడ్డు, గొల్లప్రోలు జంక్షన్ తాటిపర్తి రోడ్ల వద్ద పెద్ద ఎత్తున మహిళలు, యువత పార్టీ జెండాలు చేతబూని, వాటిని రెపరెపలాడిస్తూ తమ అభిమాన నేతకు సాదర స్వాగతం పలికారు. అక్కడి నుంచి చేబ్రోలు జంక్షన్ మీదుగా చేబ్రోలు ఆదర్శ కాలేజీ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల వద్ద స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలకగా, ఆయన వారికి అభివాదం చేశారు. అనంతరం ఆయన దుర్గాడ సెంటర్ సత్తెమ్మ తల్లి ఆలయం మీదుగా కత్తిపూడి చేరుకున్నారు.

వెంట వచ్చిన జన ప్రవాహం

పిఠాపురం మండలం చిత్రాడ నుంచి కత్తిపూడి వరకు సుమారు 19 కి.మీ. పైగా జన ప్రవాహం బస్సుయాత్ర వెంట కొనసాగింది. షెడ్యూల్ కంటే రెండు గంటల పాటు బస్సుయాత్ర ఆలస్యమైనా, జనం ఆయన వచ్చే వరకూ అలా వేచి చూస్తూనే ఉన్నారు. పిఠాపురంలో మేళతాళాలతో యువకులు కదం తొక్కగా, జనం నృత్యాలు చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. రోడ్డు షో పొడవునా ఆత్మీయ పలకరింపులు, అభివాదాలతో అశేష జనవాహినిని దాటుకుంటూ ఆయన ప్రత్తిపాడు నియోజకవర్గం కత్తిపూడికి చేరుకున్నారు.

అభిమాన నేతకు అపూర్వ స్వాగతం

- ఫ్లైఓవర్‌పై బస్సు నుంచి ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం
- దిష్టితీసి హారతి ఇచ్చిన దవులూరి భార్య చంద్రకళ, కుమార్తె సార్విక



సామర్లకోటలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దిష్టి తీస్తున్న దవులూరి సతీమణి చంద్రకళ, కుమార్తె సార్విక



సామర్లకోట ఫ్లైఓవర్‌పై ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి సామర్లకోటలో అపూర్వ స్వాగతం లభించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శుక్రవారం సామర్లకోటకు చేరింది. రాజానగరం మండలం ఎస్టీ రాజాపురం నుంచి పెద్దాపురం ఏడీబీ రోడ్డు మీదుగా సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు మధ్యాహ్నం 12.37కు చేరుకున్న ఆయనకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. జగన్‌మోహన్‌రెడ్డి బస్సుకు ఎదురుగా దవులూరి దొరబాబు భార్య చంద్రకళ, కుమార్తె సార్విక దొరబాబుతో కలిసి గుమ్మడికాయలతో హారతి ఇచ్చారు. అనంతరం దవులూరిని ఆయన బస్సులోకి ఆహ్వానించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మహిళలు గుమ్మడికాయతో సీఎం జగన్‌కు హారతి ఇచ్చారు. ఫ్లైఓవర్ పొడవునా ఉన్న జనాన్ని చూసిన జగన్ బస్సు ఎక్కి ప్రతి ఒక్కరికీ అభివాదం చేశారు. బస్సుపై నుంచి అభివాదం చేస్తూ వెళ్తున్న సమయంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న చెట్టు కొమ్మలు అడ్డు రావడంతో జనం హెచ్చరికతో కిందకి వంగారు. మధ్యాహ్నం 12.48 నిమిషాలకు బస్సు సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగి ఉండూరు జంక్షన్ వద్ద భోజన విరామం ప్రదేశానికి చేరుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రక్షణ దృష్ట్యా పోలీసు ఆంక్షలు ఎన్ని ఉన్నప్పటికీ ఆయనను చూసేందుకు మండే ఎండలో కాలినడకన రెండు కిలో మీటర్ల దూరం నడిచి వచ్చి ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు.



సామర్లకోటలో సీఎం జగన్‌కు దిష్టి తీసేందుకు వచ్చిన మహిళలు



పిఠాపురం నియోజకవర్గంలో రోడ్డు పక్కన పార్టీ జెండాలతో పిల్లలు, యువకుల సందడి



పిఠాపురంలో బస్సులో వెళుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దిష్టి తీసేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు వచ్చిన పిఠాపురం ప్రజలు

క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలసిన కౌన్సిలర్ రాజ్‌కుమార్



అచ్చంపేటలో ముఖ్యమంత్రిని కలిసిన కౌన్సిలర్ రాజ్‌కుమార్

సామర్లకోట: ఎన్నికల ప్రచారంలో భాగంగా కాకినాడ రూరల్ నియోజకవర్గం అచ్చంపేటకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని స్థానిక 29 వార్డు కౌన్సిలర్ కరణం రాజ్ కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు కౌన్సిలర్ రాజ్‌కుమార్‌ను ముఖ్యమంత్రికి పరిచయం చేశారు.

ఓటుపై చైతన్య ర్యాలీ

సామర్లకోట: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని అవగాహన కల్పిస్తూ ఓటర్లను చైతన్యం పరుస్తూ శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ పట్టణ పురవీధుల గుండా నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోర్సలో అన్న సమారాధన

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో ఉన్న రామాలయం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కొమరగిరి, కుతుకుడుమిల్లి తదితర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరై, స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

భారీగా తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



కొత్తపల్లి మండలం కొమరగిరి నుంచి బయలుదేరిన పార్టీ నాయకులు

కొత్తపల్లి: కాకినాడ రూరల్ పరిధిలో అచ్చంపేట జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన మేమంతా సిద్ధం బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టిబత్తిన సురేష్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో-ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో బయలుదేరారు.

వైభవంగా శృంగార వల్లభుని కల్యాణం

పెద్దాపురం: మండలం తొలి తిరుపతిలోని స్వయంభూ శృంగార వల్లభుని దివ్య కళ్యాణం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలతో వేలాది భక్తుల జన సందోహం మధ్య ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్, ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో శృంగార వల్లభుని ఉభయ దేవరులైన లక్ష్మీదేవి, భూదేవి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వందల సంఖ్యలో దంపతులు పీటలపై ఆశీనులు కాగా ఉత్సవ దేవాతామూర్తులను ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, వేదపండితుల మంత్రాల మధ్య ఆలయ నుంచి మండపానికి తీసుకువచ్చి స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. దేవదాయ శాఖాధికారులు స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారి కళ్యాణానికి వచ్చి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భారీ విద్యుత్ అలంకరణ, మందుగుండు సామగ్రి, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామి వారి కల్యాణం మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతను సంతరించకుంటూ గోవిందనామ స్మరణతో మార్మోగింది.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బంగారు, వెండి పుష్పాల నడుమ మరిడమ్మ తల్లి

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



కొత్తపల్లిలో రాజీనామా పత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందిస్తున్న వలంటీర్

కొత్తపల్లి: గ్రామ వలంటీర్ల సేవలపై టీడీపీ ఈసీకి ఫిర్యాదు చేయడానికి నిరసనగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన వలంటీర్ల రాజీనామాలు మూక్కుమ్మడిగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మూలపేట-5, ఉప్పాడ-14, కొమరగిరి-18, కొత్తపల్లి-20, రమణక్కపేట-3 మొత్తం 60 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామాల పత్రాలను ఆయా పంచాయతీల కార్యదర్శులకు అందజేశారు. ఇప్పటి వరకు మండలంలో 239 మంది రాజీనామా చేసినట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే తమపై టీడీపీ ఆరోపణలు చేయడం దారుణమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా ఇళ్లకు వెళ్లి అందించే వారమన్నారు. ఇప్పుడు రాజీనామా చేసి, ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు.

నేత్ర పర్వంగా మాండవ్యనారాయణుని కల్యాణం



సామర్లకోటలోని మాండవ్య నారాయణస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సామర్లకోట: అతి పురాతన విష్ణు ఆలయమైన శ్రీ, భూ సమేత మాండవ్యనారాయణస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు మంగళ స్నానాలు, పంచామృతాలతో అభిషేకాలు, విఘ్నేశ్వర పూజ, అంకురారోపణ, ధ్వజారోహణ చేశారు. ఆలయ భక్త బృందంచే విష్ణు సహస్ర నామ పారాయణ జరిగింది. రాత్రి ఆలయ పండితులు చక్రవర్తుల రవికుమార్, రఘురామ్‌ల ఆధ్వర్యంలో చైత్ర శుద్ధ ఏకాదశి పర్వదినంలో కల్యాణం జరిగింది. ఆలయంలో పూలతో అలంకరించిన ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను ఉంచి వేద మంత్రాలతో కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం ప్రసాద వితరణ జరిగింది. స్వామి వారి కల్యాణ ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. లోక కల్యాణార్థం ఏటా ఈ కల్యాణం జరుగుతుందని వేద పండితులు తెలిపారు. లయన్స్ క్లబ్ ఉప గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ దంపతులు, పారిశ్రామిక వేత్త బిక్కిన సాయి దంపతులు, తలుపుల అంజనీ కుమార్ దంపతులు భక్తులకు సేవలందించారు. 24వ తేదీ రాత్రి శ్రీపుష్ప యోగోత్సవంతో కల్యాణ ఉత్సవాలు ముగియనున్నాయి. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు సాగుతున్నాయి.

పోలింగ్ శాతం పెంపే స్వీప్ లక్ష్యం



స్వీప్ అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో 83 శాతం పైగా పోలింగ్ నమోదు లక్ష్యంగా ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం (స్వీప్) సదస్సులు నిర్వహించనున్నట్టు పెద్దాపురం ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ మాదిరెడ్డి ఉషారాణి అన్నారు. మండలంలోని చినబ్రహ్మదేవంలో శుక్రవారం ఆమె ఓటరు అవగాహన కార్యక్రమంలో ప్రసంగించారు.. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉషారాణి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా సగటున 79.77 శాతం పోలింగ్ నమోదు కాగా జాతీయ స్థాయిలో 69 శాతం పోలింగ్ నమోదైందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో 83 శాతం పైగా పోలింగ్ నమోదు కావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ఎన్నికల సంఘం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ఓటు అనే వజ్రాయుధంతో ప్రతి పౌరుడూ తమ ఓటు ద్వారా మంచి ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల పోలింగ్‌లో భాగస్వాములై పోలింగ్ శాతాన్ని పెంచాలని వారు కోరారు. అనంతరం ఓటు హక్కు వినియోగం, ఎన్నికల పోలింగ్ సరళి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు చౌదరి, శర్మ, పంచాయతీ కార్యదర్శి వీఆర్ఓలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయంపై అవగాహన అవసరం

ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఆసిఫ్



ఎన్నికల ప్రక్రియపై ఆరా తీస్తున్న వ్యయ పరిశీలకుడు ఆసిఫ్

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎ.ఆసిఫ్ ఆదేశించారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా శుక్రవారం నియోజకవర్గ నామినేషన్ కేంద్రం ప్రక్రియను ఆయన ఆర్ఓ జేఎస్ రామారావుతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను సజావుగా, పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అభ్యర్థుల వ్యయ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల వ్యయ నిబంధనలతో పాటు ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్, నియమావళిపై అవగాహన పెంచాలన్నారు. అనంతరం నామినేషన్ కేంద్రం వద్ద జరుగుతున్న వెబ్ కాస్టింగ్, నామినేషన్ల ప్రక్రియ తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియతీరుపై ఆర్ఓ జేఎస్ రామారావును అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి, డీటీ భానుకుమార్, పద్మజ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన



ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గొల్లప్రోలు: మండలంలో వివిధ గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్, మండల వ్యవసాయాధికారి కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం పలు రైతు భరోసా కేంద్రాల్లో అవగాహన కల్పించారు. సాధారణ రకం 75 కేజీలు: రూ.1,637, గ్రేడ్-ఎ రకం రూ.1,652 ప్రభుత్వ ధరగా నిర్ణయించినట్టు వివరించారు. రైతులు తన పంటను దళారుల ప్రమేయం లేకుండా అమ్ముకోవచ్చని చెప్పారు. రైతులు మద్దతు ధర రాకపోతే తహసీల్దార్ 98499 03880కు, మండల వ్యవసాయాధికారి 83310 56595 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.